

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

## ఏం చేశారో చెప్పండి

- ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా?
- ఏ ఘనకార్యం చేశారని మంత్రులు, కాంగ్రెస్ నాయకులు ప్రజల్లో తిరుగుతున్నారు
- వ్యవస్థను నిర్మించిన కేసీఆర్‌పై విమర్శలా?
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 01 : కాంగ్రెస్ నాయకులు అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నో అబద్ధాలు చెప్పారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఏం చేశారో చెప్పాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిలదీశారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా పూర్తిస్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఏ మొఖం పెట్టుకొని కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు? అని ప్రశ్నిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. అసలు అధికారంలో ఉండి ఏ ఘనకార్యం చేశారని మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రజల్లో తిరుగుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి ఒక్కటైనా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. రుణమాఫీ అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్‌కు సిగ్గుండాలన్నారు. ఒక్క గ్రామంలోనైనా పూర్తి స్థాయిలో అమలు చేశారా? అని ప్రశ్నించారు. ఏ గ్రామానికైనా వచ్చి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తారా? అని నిలదీశారు. ఎన్నికల్లో ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఎంత మందికి చేశారన్నారు. రాష్ట్రంలో 40 శాతానికి మించి రుణమాఫీ జరగలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు చెప్పిన వాటితోపాటు చెప్పని ఎన్నో పథకాలను అమలు చేసి చూపించిందన్నారు. సవాలక్ష ఆంక్షలు పెట్టి రుణమాఫీ అని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని, ఆ సమయంలో వ్యవసాయం సాగిందా? సాగు నీళ్లు ఉన్నాయా? అని నిలదీశారు. రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు, వలసలు లేవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, నీళ్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ఆది నుంచి కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసిందన్నారు. కానీ, అదే ప్రాజెక్టు ఇప్పుడు జీవనాధారంగా నిలిచిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పోలీసులు, గురుకులాలు, వ్యవసాయం, కొత్త జిల్లాల ఏర్పాటు, తదితర వాటితో 2 లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాలను తీసి వేస్తే కేసీఆర్ హయాంలోనే మళ్లీ తీసుకువచ్చి 19 వేల ఉద్యోగాలను కల్పించామన్నారు. కార్మికులకు అండగా అనేక కార్యక్రమాలను కేసీఆర్ తీసుకున్నారని గుర్తు చేశారు. ఎంతో నాణ్యతతో తాము గురుకులాలను ఏర్పాటు చేస్తే ఇప్పుడు వాటిల్లో పురుగుల అన్నం తినలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే 37 మంది విద్యార్థులు చనిపోయారని చెప్పారు. ఇంకా సిగ్గు లేకుండా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. గత పదేళ్లల్లో డెంగ్యూ, చికెన్ గున్యా వంటి రోగాలు ప్రబలలేదని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ చేతగానితనంతో గ్రామాలు అనారోగ్యం బారిన పడుతున్నాయన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలు కూడా కల్పించడం లేదని దుయ్యబట్టారు. రైతుభరోసా ఎక్కడపోయిందని, కళ్యాణిలక్ష్మి కింద ఇస్తానన్న తులం బంగారం ఏదని ప్రశ్నించారు. ఇన్ని అబద్ధాలు ఆడిన సీఎంను, ప్రభుత్వాన్ని ప్రపంచంలో ఎక్కడా చూడలేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజలు తరిమికొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మంత్రులు, నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలని హితవుపలికారు. సమావేశంలో మాజీ మేయర్ రవీందర్‌సింగ్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, గుంజపడుగు హరిప్రసాద్ పాల్గొన్నారు.



కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు

## పెన్షన్ భిక్ష కాదు.. మా హక్కు

- పాత పెన్షన్ విధానమే అమలు చేయాలి
- ఉద్యోగులు, ఉపాధ్యాయుల డిమాండ్
- నల్లబ్యాడ్జీలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసన

పెద్దపల్లి, సెప్టెంబర్ 01: ''పెన్షన్ భిక్ష కాదు.. అది మా హక్కు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీపీఎస్, కేంద్రం కొత్తగా తేనున్న ఏకీకృత పెన్షన్ విధానం మాకొద్దు. పాత పెన్షన్ విధానమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలుపుకోవాలి'' అని వందలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు రోడ్డెక్కారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళా ఉద్యోగులు సైతం ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదిస్తూ కదం తొక్కారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం అమలు ప్రారంభమైన సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉద్యోగ, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసనకు ముఖ్యఅతిథిగా జేఏసీ జిల్లా శాఖ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు కూడా పాలకులు పాటించకపోవడం శోచనీయమన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తెలంగాణలోనూ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా పొందుపర్చిందని గుర్తుచేశారు. సీపీఎస్‌పై ఉద్యోగులంతా దుమ్మెత్తిపోస్తుండగా, యూనిఫైడ్ పెన్షన్ స్కీం అంటూ మరో కొత్త విధానానికి కేంద్ర ప్రభుత్వం తెరతీసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. పెన్షన్ లేని రంగాలకు ప్రతిభ కలిగిన ఉద్యోగులు రావడం లేదని, మెరుగైన వనరులు కూడా లేవన్నారు. దీంతో ప్రభుత్వోద్యోగాల వైపు మేధావులు ఆలోచించడం లేదన్నారు. యువతకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, ప్రభుత్వాలపై నమ్మకం కల్పించాలన్నారు. ఈ నిరసనలో టీఎన్జీవోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు, టీజీవో నాయకులు కాళీచరణ్, విష్ణువర్ధన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పీ కేశవరెడ్డి, కార్యదర్శి లింగయ్య, ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు పర్రె రాజేశం, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, రాగి శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాజిరెడ్డి, రవీంద్రచారి, దామెర మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, విజయేందర్‌రెడ్డి, వెంకన్న, విద్యాసాగర్, నాలుగోతరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర తొలి స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి

## విశ్వబ్రాహ్మణుల ఉన్నతికి కృషి చేస్తా

రాష్ట్ర తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 1 : విశ్వబ్రాహ్మణుల ఉన్నతికి కృషి చేస్తానని రాష్ట్ర తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్‌సార్ వోపా కమ్యూనిటీ హాల్‌లో జిల్లా విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రజతోత్సవ ప్రారంభవేడుకల్లో, కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు తమ కులవృత్తుల్లోనూ రాణించాలన్నారు. విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలుచేయాలని, నిరుపేదలకు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వోపా రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల పేద విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక వసతి భవనాలు గృహాలను ఏర్పాటు చేయాలన్నారు. వోపా జిల్లా అధ్యక్షుడు కట్ట విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ ఆచార్య, మొగ్దుంపూర్ విశ్వబ్రాహ్మణ కాలనీ అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, రాష్ట్ర వోపా సభ్యుడు సింహారాజు కోదండ రాములు, వోపా జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జెట హరిహరాచారి, బులియన్ మర్చంట్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వంగళ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఓదెల: కొమిరెలో కూలిన ఇల్లు



రాయికల్: అలూరులో వాగు అవతలి నుంచి కూలీలను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న గ్రామస్తులు



రాజన్న సిరిసిల్ల: జలమయమైన అశోక్‌నగర్

# కుండపోత



కరీంనగర్: నిలిచిన బస్సులు



కొత్తపల్లి: మత్తడి దుంకుతున్న కొత్తపల్లి చెరువు



కరీంనగర్: ముకరంపురలో ఇండ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

వర్షం ముంచెత్తింది. శనివారం రాత్రి మొదలైన వాన ఆదివారం రోజంతా కుండపోత పోసింది. క్షణంపాటు తెరిపిలేకుండా.. కుంభవృష్టిగా కురిసింది. వదలని వానతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, చెరువులు, కుంటలన్నింటికీ జలకళ వచ్చింది. ఎక్కడికక్కడ పంట పొలాలు నీట మునగగా, పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి బాహ్య ప్రపంచంతో సంబంధం తెగిపోయింది. వర్ష బీభత్సానికి పలుచోట్ల పాత ఇండ్లు కూలిపోయి బాధితులు నిరాశ్రయులు కాగా, కాల్వశ్రీరాంపూర్ మండలం కొత్తపల్లిలో నక్కల ఒర్రెలో ఓ యువకుడు, కూనారం పెద్ద చెరువులో పడి మత్స్యకారుడు గల్లంతుకావడం కలిచివేసింది. భారీగా వర్షాలతో ప్రాజెక్టులకు వరద పోటెత్తుతున్నది. మరో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. లోతట్టు, నదీపరివాహక ప్రజలను అప్రమత్తం చేస్తున్నది.

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- నీటమునిగిన పంటపొలాలు
- అలుగుపారుతున్న చెరువులు, కుంటలు
- పలుచోట్ల కూలిన ఇండ్లు
- కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఇద్దరి గల్లంతు
- ఉధృతంగా గోదారి, మానేరు నదులు
- ఎల్లంపల్లికి 1.29లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 20 గేట్లు ఓపెన్
- ఉప్పొంగుతున్న మోయతుమ్మెద.. ఎల్‌ఎండీకి 47వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- అధికార యంత్రాంగం అప్రమత్తం



కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట ప్రవహిస్తున్న వర్షపు నీరు




వేములవాడ: నీట మునిగిన బుడిగ జంగాల కాలనీ

పెద్దపల్లి, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో వర్షం దంచికొట్టింది. పెద్దపల్లి, మంథని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, ఉదయ్‌నగర్, పోలీస్ స్టేషన్ ఏరియాలతో పాటుగా వివిధ వాడల్లో వరద నీరు భారీగా వచ్చి చేరింది. పెద్దపల్లి-కరీంనగర్ ప్రధాన రహదారి రాజీవ్ రహదారిపై రంగంపల్లి వవద్ద భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షంతో జిల్లాలో 500 వరకు చెరువులు మత్తడులు దుంకాయి. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల వాగు ఉప్పొంగుతున్నది. కాగా, జిల్లాలో సగటున 49.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సుల్తానాబాద్ మండలంలో 101.3మిల్లిమీటర్లు, అత్యల్పంగా ముత్తారంలో 7.3 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్, ప్రగతినగర్, సంజీవయ్యనగర్, నేతన్న చౌరస్తాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతా లను విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించి వరద తీవ్రతను పరిశీలించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో శనివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి భారీ వరద వచ్చి చేరుతోంది. రేకొండ నుంచి సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ వెళ్లే దారిలోని ఒర్రెలు పొంగుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. హుజూరాబాద్‌లోని చిలుక వాగు, శంకరపట్నంలోని కేశవపట్నం వాగు పొంగుతోంది.



గంగాధర: నారాయణపూర్ వద్ద ముంపు బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్: రాంనగర్‌లోని ప్రధాన రోడ్డుపై నిలిచిన వరద నీరు



కోనరావుపేట: మామిడిపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న మూలవాగును పరిశీలిస్తున్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

### ఒర్రె, చెరువులో పడి ఇద్దరు గల్లంతు

కాల్వశ్రీరాంపూర్ మండలంలో వేర్వేరు చోట్ల ఇద్దరు గల్లంతయ్యారు. మీర్జంపేట జీపీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్ ఆదివారం కొత్తపల్లి -మల్యాల గ్రామాల మధ్య నక్కల ఒర్రె దాటుతుండగా బైక్ అదుపుతప్పి కల్వర్టులో పడిపోయింది. పవన్ ఒడ్డుపైనే ఉండిపోయాడు. అయితే, బైక్ కొత్తది కావడంతో బైక్‌ను బయటికి తీసుకొచ్చేందుకు సాయం కోసం జీపీలో తనతో పనిచేసే సూర్యకు ఫోన్ చేశాడు. అతను రాగానే, ఇద్దరూ కలిసి బైక్‌ను ఒర్రెలో నుంచి తీసే క్రమంలో ఇద్దరూ ఒర్రెలో పడిపోయారు. సూర్య ఈదుకుంటూ బయటకు రాగా, పవన్ గల్లంతయ్యాడు. బంధువులు, గ్రామస్తులు పవన్ అచూకీ కోసం గాలిస్తున్నారు. మరో ఘటనలో కూనారం పెద్ద చెరువులో పడి కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన మత్స్యకారుడు గొస్కుల కుమార్ (45) గల్లంతయ్యాడు. వరదతో చెరువు నిండగా, చేపలు బయటికి వెళ్లిపోకుండా వల కట్టేందుకు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గొస్కుల కుమార్, కలవేన మొగిళి, సాగర్ల తిరుపతి, చేతి నర్సయ్య వెళ్లారు. మత్తడి వద్ద వల కడుతుండగా, గోస్కుల కుమార్ చెరువులో పడి గల్లంతైనట్లు మిగతా ముగ్గురు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



పెద్దపల్లి: పోలీస్ స్టేషన్ ఎదుట ప్రవహిస్తున్న వరద



గంగాధర: లక్ష్మీదేవిపల్లి వద్ద నీట మునిగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్



జగిత్యాల రూరల్: అనంతారం రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

### ప్రాజెక్టులకు భారీగా వరద

పెద్దపల్లి, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ)/ తిమ్మాపూర్/ బోయినపల్లి/ గంభీరావుపేట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టులకు భారీగా వరద వస్తోంది. గోదారి ఉధృతి పెరుగడం, ఎగువ నుంచి వరద వస్తుండడంతో పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి బరాజ్‌కు 1,29,269 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ఈ క్రమంలో 20 గేట్లను ఎత్తి 1,44,168 క్యూసెక్కుల నీటిని దిగువన సరస్వతీ బరాజ్‌కు వదులుతున్నారు. అక్కడ సైతం అన్ని గేట్లు ఎత్తి వచ్చింది వచ్చినట్టే దిగువకు నీటి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు మత్తడి దుంకుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 31 అడుగులకు గాను ఆదివారం రాత్రి వరకు పూర్తి స్థాయిలో నిండింది. కామారెడ్డి జిల్లా పాల్వంచ, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వాగుల ద్వారా మానేరుకు 32 వేల క్యూసెక్కులకు పైగా భారీగా వరద వస్తోంది. ఇక బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయానికి సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగుల నుంచి 33,805 క్యూసెక్కులు, గాయత్రీ పంప్‌హౌస్ నుంచి 6300 క్యూసెక్కుల వరద వస్తున్నది. 27.5టీఎంసీల సామర్థ్యం ఉన్న మధ్యమానేరులో ప్రస్తుతం 15.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కరీంనగర్ జిల్లాలోని ఎల్‌ఎండీ రిజర్వాయర్ నిండుతున్నది. ఉప్పొంగుతున్న మోయతుమ్మెద వాగు ద్వారా 40 వేల క్యూసెక్కులు, శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి 3వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. 24 టీఎంసీల సామర్థ్యం ఎల్‌ఎండీలో ప్రస్తుతం 14.058 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. భారీగా వరద వస్తున్న నేపథ్యంలో నేడో, రేపో ఎల్‌ఎండీ నిండే అవకాశం ఉంది.



మేడిపల్లి: భీమారం మండలం కమ్మరిపేటలో వరదను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్



గంభీరావుపేట: మత్తడి దుంకుతున్న నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు



జగిత్యాల టౌన్: గోవిందుపల్లె – వెంకటాద్రినగర్‌కు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



పెద్దపల్లి: రంగంపల్లి వద్ద సహాయక చర్యలు చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది



గోదావరిఖని: ఫైవింక్లయిన్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద